www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -265 మంగళవారం 10 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# సంస్కృతికి ప్రతీక
# తెలంగాణ తల్లి



- ◆తల్లికి కిరీటం ఉంటుందని ఎక్కడా చూడలేదు
- ◆సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మల స్ఫూర్తి
- ◆అందరితో చర్చించి.. తల్లి విగ్రహానికి రూపకల్పన
- ◆రాజకీయాలు మాని విగ్రహావిష్కరణలో పాల్గొనాలి
- ◆ఇకనుంచి డిసెంబర్ 9నే తెలంగాణ ఆవిర్భావం
- ◆తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ 9న జరిగింది
- ◆తెలంగాణ అంటే ఒక్క కుటుంబ వ్యవహారం కాదు
- ◆తెలంగాణ కోసం ఎందరో పోరాటాలు..
- ◆మరెందరో ఆత్మబలిదానాలు
- ◆అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి: డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభంలో ఆయన సభలో తెలంగాణ ఏర్పాటు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. సోనియా లేకుంటే తెలంగాణ ఏర్పాటు అయ్యేదా అని అన్నారు. రాష్ట్ర ప్రజలు



ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు అందుకే ఇకముందు డిసెంబర్ 9న తెలంగాణ ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. 'ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

మిగతా 2లో.



## ఆర్బీఐ కొత్త గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా

ముగియనున్న శక్తికాంత దాస్ పదవీకాలం
ప్రస్తుతం రెవెన్యూ శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ మల్హోత్రా

2లో.



## తెలంగాణ గ్రూప్-2 హాల్ టికెట్ల విడుదల

15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు

# చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

### తెలంగాణ హైకోర్టు తీర్పు చెన్నమనేనికి రూ.30 లక్షల జరిమానా విధింపు



హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి:
వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని హైకోర్టు నిర్ధారించింది. పౌరసత్వం కేసులో దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు రూ. 30 లక్షల జరిమానా విధించింది. **మిగతాది 2లో...**

### ప్రభుత్వాలు మారితే తల్లులు మారొద్దు
# తలరాతలు మారాలి

- రేవంత్ సర్కార్ పెట్టింది కాంగ్రెస్ తల్లి విగ్రహం
- బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ సంస్కృతిపై దాడే
- నేడు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు జరపాలని కెటిఆర్ పిలుపు

కుత్బుల్లాపూర్:డిసెంబర్9(ప్రజావినికిడి:
ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మా రాలి.. తల్లులు మారొద్దు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అ న్నారు. పార్టీ మేడ్చల్ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గం, మాజీ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్సిలు, ఎంఎల్సిలు తదితరులతో కలిసి ఆయన కుత్బుల్లాపూ ర్ చేరుకున్నారు. నూతన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పార్టీ జిలా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, సెక్రటేరియట్లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తామని అన్నారు.**మిగతాది 2లో...**





# పౌరసేవలు మరింత సులభతరం

### సరికొత్త మొబైల్ యాప్ ను అందుబాటులోకి
### యాప్ ద్వారా పౌరులకు సేవలను మరింత చేరువ

హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి:
తెలంగాణ ప్రజలు ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా మీసేవ యాప్‌ను ఐటీశాఖ సిద్ధం చేసింది. ఈ యాప్ ద్వారా దాదాపు 150 రకాల పౌర సేవలను పొందవచ్చు. హైదరాబాద్ మెట్రో స్టేషన్లు, షాపింగ్ మాల్స్, కలెక్టరేట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఇంటరాక్టివ్ కియోస్క్ ద్వారా కూడా ప్రజలు పౌర సేవలు పొందవచ్చు. డిజిటల్ చెల్లింపులు, అప్లికేషన్లు, సర్టిఫికెట్‌లు ప్రింట్ తీసుకునే అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. మీసేవలో తెలంగాణ ప్రభుత్వం కొత్త సర్వీసులను చేర్చింది. దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ, సదరం సర్టిఫికెట్ల జారీ, టూరిజం హోటల్స్, ప్యాకేజీల బుకింగ్, పర్మిట్ల రెన్యూవల్, కొత్తవి జారీ చేయటం, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులకు సంబంధించిన సర్వీసులను మీసేవలో చేర్చింది. ఈ నిర్ణయంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ విప్లవానికి రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకురానుంది. లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించనుంది. **మిగతాది 2లో...**

# తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరేం కాదు

**9, 10 తరగతుల సిలబస్ లో స్వల్ప మార్పు**
**నిబంధనను 8వ తరగతి వరకు మాత్రమే అమలు**
**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి:
10 తరగతి మినహా మిగతా బోర్డులకు సంబంధించిన పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ నిబంధనను కేవలం 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలని, 9, 10 తరగతులకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.. తెలంగాణ రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు రాష్ట్ర సర్కార్ కీలక అప్‌డేట్ జారీ చేసింది. ప్రస్తుత (2024-25), వచ్చే విద్యా సంవత్సరం (2025-26) తొమ్మిదవ, పదో తరగతి చదివే విద్యార్థులు తెలుగును ఒక సబ్జెక్టుగా చదవడంపై మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు పాఠశాల విద్యార్థులు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ చట్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ చట్టం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు చదవడం లేదు. కేవలం ఐదు సబ్జెక్టులే చదువుతున్నారు. భాషా సబ్జెక్టుల్లో ఆంగ్లం, హిందీ మాత్రమే వీరంతా అభ్యసిస్తున్నారు
**మిగతాది 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సంస్కృతికి ప్రతీక తెలంగాణ తల్లి

(మొదటి పేజి తరువాయి)

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఉదయం 10:30 గంటలకు శాసనసభ, శాసన మండలి ఉభయ సభలు ప్రారంభమయ్యాయి.

తొలి రోజు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. తెలంగాణ తల్లిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను గట్టిగా తిప్పి కొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణ తల్లి వేరు, దేవత వేరు. ఏ తల్లికి కిరీటం ఉండదు. దేవతలకు మాత్రమే కిరీటం ఉంటుంది..ప్రభుత్వం ఆవిష్కరిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహాన్ని. తెలంగాణ గ్రామ దేవత పోచమ్మకు కిరీటం ఉంటుందా. ఈ విషయాన్ని జనాలకు వివరించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.అసెంబ్లీలో తెలంగాణ తల్లిపై చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంపై అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటన చేశారు.'సంస్కృతికి ప్రతిరూపమే తెలంగాణ తల్లి. 4కోట్ల ప్రజలను ఏకం చేసి నడిపించిన తల్లి తెలంగాణ తల్లి. అలాంటి తల్లి రూపాలు ఇప్పటికే జన బాహుళ్యంలో ఉన్నాయి. వాటికి ఇప్పటికీ అధికారికంగా గుర్తింపు లేదు. మన సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టి పడేలా తెలంగాణ తల్లిని రూపొందించాం. చరిత్రకు దర్పంగా పీఠాన్ని రూపొందించాం. తెలంగాణ తల్లిని ఈ రోజు సచివాలయంలో ఆవిష్కరిస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు. 'స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి అని,. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపిందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి



స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం.సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం అని తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై ప్రకటన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతు లను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండుపూసలు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం' అని రేవంత్‌రెడ్డి వివరించారు. 'తెలంగాణ సమాజం ఆరు దశాబ్దాలు



పోరాటం చేసింది. ఓయూ, కేయూ కీలక భూమిక పోషించాయి. సామాజిక బాధ్యతతో విద్యార్థులు ఉద్యమ బాట పట్టారు. శ్రీకాంతాచారి వంటి చాలా మంది విద్యార్థులు అమరులయ్యారు. ఉద్యమాన్ని గౌరవించి డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసింది. అందుకే ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రతిరూపమే అధికారికంగా లేదు. అందరితో చర్చించి తెలంగాణ తల్లి రూపంపై నిర్ణయం తీసుకున్నాం. దేవతలా ఉండాలా లేక మన ఇంట్లో తల్లిలా ఉండాలా అనే చర్చ జరిగింది. తల్లి ప్రతిరూపమే పెట్టుకోవాలనే అభిప్రాయం వచ్చింది. అందుకే ఈ రోజు బహుజన తల్లిని ఆవిష్కరిస్తున్నాం. కొందరికి ఇది నచ్చలేదు. ఒక కుటుంబం, ఒక వ్యక్తి తెలంగాణ అనే భావన మంచిది కాదు. ఈ ఒక్కరోజు రాజకీయాలు పక్కన పెడదాం. రేపటి నుంచి రాజకీయ అంశాలు ప్రస్తావిద్దాం. సాయంత్రం 6గంటల ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ అధినేత,. మాజీ సీఎం కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కమ్యూనిస్టు నేతలను ఆహ్వానిస్తున్నాం. అందరూ విగ్రహావిష్కరణకు హాజరు కావాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# ఆర్బీఐ కొత్త గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా

**ముగియనున్న శక్తికాంత దాస్ పదవీకాలం**

**ప్రస్తుతం రెవెన్యూ శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ మల్హోత్రా**



డిసెంబర్9(ప్రజావినికిడి:

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్బీఐ గవర్నర్ గా బాధ్యతలు నిర్వర్తించిన శక్తికాంత దాస్ స్థానాన్ని సంజయ్ మల్హోత్రా భర్తీ చేయనున్నారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్ గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పదవీకాలం పూర్తయినప్పటికీ, మరికొన్నాళ్ల పాటు పదవీకాలం పొడిగించారు. పొడిగించిన పదవీకాలం రేపు డిసెంబరు 10తో ముగియనుంది. శక్తికాంత దాస్ స్థానంలో ఆర్బీఐ పగ్గాలు అందుకోబోతున్న సంజయ్ మల్హోత్రా పదవీకాలం బుధవారం ప్రారంభం కానుంది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకుకు 26వ గవర్నర్ గా సేవలు అందించనున్నారు.

సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆయన ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు.

సివిల్స్ రాసి ఐఏఎస్ అయిన సంజయ్ మల్హోత్రా... తన 33 ఏళ్ల కెరీర్ లో విద్యుత్, ఆర్థిక, పన్నులు, సమాచార సాంకేతికత, గనుల శాఖలో విధులు నిర్వరించారు.

# ప్రభుత్వాలు మారితే తల్లులు మారొద్దు తలరాతలు మారాలి

(మొదటి పేజి తరువాయి)

ఎవరైతే తెలంగాణ ఉద్యమాన్ని అంత గొప్పగా ఉండడానికి వీలులేదని అన్నారో.. తెలుగు తల్లి గొప్పగా ఉన్నా ప ర్వాలేదు.. కానీ తెలంగాణ తల్లి గొప్పగా ఉందొద్దు అని కుట్రపన్నారని అన్నారు. తెలంగాణ దివాలా తీసినట్టు కనపడాలని చెప్పి ఇవాళ ఉన్న దివాలాకోరు పాలకులు వాళ్ళ దారిద్ర్యానికి ప్రత్యేకంగా తల్లి రూపాన్ని మారుస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో తల్లి విగ్రహాన్ని మార్చిన మూరు?లు ప్రపంచం లో ఎక్కడా లేరన్నారు. ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలని తప్ప తల్లులు మారడం తప్పు తప్పు అని అన్నారు. దేవతారూపంలో ఉన్న తెలంగా ణ తల్లిని చిన్నగా చేసి చూపిస్తున్నారని మండిపడ్డారు. చేతులెత్తి మొక్కే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం మార్చి అవమానించిన వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రుణమాఫీ మొత్తం తిప్పి తిప్పికొడితే 18 కోట్ల 98 లక్షలు అని అన్నారు. రేవం త్ రెడ్డి ఏమో అయిపోయింది.. అయిపోయింది.. మొత్తం అయిపోయింద అంటున్నారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అటకెక్కినై..ఏం జరిగిందో ఈ ఏడాదిలోనే ఆలోచిస్తే మూడు మాటలు చెప్పచ్చునని అన్నారు. కెసిఆర్‌కు తిట్లు, దేవుని మీద ఒట్లు, 420 హామీలకు మాత్రం తూట్లు అన్నారు. ఇదిలావుండగా, తొలుత మాజీ మంత్రులు, ఎంఎల్ఎలతో కలిసి వచ్చిన కెటిఆర్‌కు పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఎ వివేకానంద్, మేడ్చల్ జిల్లా ఎంఎల్ఎలు ఘన స్వాగతం పలికారు.

# తెలంగాణ గ్రూప్-2 హాల్ టికెట్ల విడుదల

హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2024 గ్రూప్-2 హాల్ టిక్కెట్లు విడుదల అయ్యాయి. డిసెంబర్ 9 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. గ్రూప్ -2 పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు తెలంగాన పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డును డౌన్ లోడ్ చేసుకోవచ్చు. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో గుర్తించిన 1368 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. గ్రూప్-2 సర్వీసెస్ రిక్రూట్మెంట్ పరీక్ష ఉదయం సెషన్లో ఉదయం సెషన్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, పేపర్-3, సాయంత్రం సెషన్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2, పేపర్-4 నిర్వహిస్తారు.గ్రూప్ 2 పరీక్షల ఉదయం సెషన్‌లో పరీక్షలు ఉదయం 08:30 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్ కోసం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం సెషన్ కు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ కు మధ్యాహ్నం 2:30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లను మూసివేస్తారు మరియు గేట్లు మూసివేసిన తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థిని అనుమతించరు. మొదటి సెషన్ పరీక్షకు ఉపయోగించిన డౌన్ లోడ్ చేసిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్లకు ఉపయోగించేలా అభ్యర్థులు చూసుకోవాలి. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు హాల్ టికెట్ భద్రపరుచుకోవాలి. అవసరమైనప్పుడు వాటిని ఉత్పత్తి చేయాలి. తరువాత డూప్లికేట్ హాల్ టికెట్ జారీ చేయరని కమిషన్ స్పష్టం చేసింది. .

# చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

(మొదటి పేజి తరువాయి)

25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు చెల్లించాలని, మరో రూ. 5 లక్షలు హైకోర్టు న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. నెలలోపు జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది.చెన్నమనేని జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని కోర్టు తీర్పు ఇచ్చింది. తప్పుడు పత్రాలతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని వ్యాఖ్యానించింది. తప్పుడు సమాచారంతో చెన్నమనేని రమేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ వేములవాడ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందారు. 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి, ఆ తర్వాత ఉపఎన్నికతో కలిపి 2010 నుంచి 2018 వరకు మూడుసార్లు విజయం సాధించారు. చట్టం ప్రకారం భారతీయ పౌరులు కాని వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు లేదా ఓటు వేసేందుకు అవకాశం లేదు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ జర్మన్ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉన్నారని, అది 2023 వరకు చెల్లుబాటులో ఉందని 2020లో కేంద్రం తెలంగాణ హైకోర్టుకు తెలియజేసింది. అయితే రమేశ్ తన దరఖాస్తులో వాస్తవాలను దాచిపెట్టిన కారణంగా భారతీయ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ తప్పుడు పత్రాలతో భారత ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ హైకోర్టుకు తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జర్మన్ పాస్‌పోర్ట్ సరెండర్‌కు సంబంధించిన వివరాలను, జర్మన్ పౌరసత్వాన్ని వదులుకున్నట్లు రుజువు చేస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేయమని హైకోర్టు రమేశ్ ను ఆదేశించింది. ఈ కారణంతో 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రమేశ్ ఉపఎన్నిక విజయాన్ని రద్దు చేసింది. దీంతో రమేశ్ సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే విధించింది. స్టే అమల్లో ఉండగానే 2014, 2018 ఎన్నికల్లో చెన్నమనేని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

# పౌరసేవలు మరింత సులభతరం

(మొదటి పేజి తరువాయి)

ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు.. టెలిఫోన్, తెలుగు ఓటీటీలను ప్రజలు చూడటానికి వీలుంటుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారని చెబుతున్నారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చని.. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నట్టు అధికారులు వివరిస్తున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచే ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని.. అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. ఫైబర్ నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయని అధికారులు వివరిస్తున్నారు.

# తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరేం కాదు

(మొదటి పేజి తరువాయి)

ఇతర బోర్డుల్లో తెలుగు మాతృభాష కానివారు కూడా అధిక సంఖ్యలో ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆ సబ్జెక్టులో తప్పనిసరిగా పాస్ కావాలంటే ఇబ్బందులు వస్తాయని భావించిన విద్యాశాఖ 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు అమలును మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2025 ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. పరీక్ష రాసిన అభ్యర్థులు అప్లికేషన్ లేదా అడ్మిట్ కార్డు నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి స్కోరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో డిసెంబర్ 1వ తేదీన క్లాట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు డిసెంబర్ 9న అందుబాటులో రానున్నాయి. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా నేషనల్ లా స్కూల్స్, యూనివర్సిటీల్లో యూజీ, పీజీ డిగ్రీ ప్రోగ్రాలలో (ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం) ప్రవేశాలు కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 24 ప్రధాన లా యూనివర్సిటీలు ఇందులో పాల్గొంటున్నాయి. కాగా ఆలిండియా స్థాయిలో ఏటా కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివేందుకు అవకాశం ఉంటుంది.

# అన్ని విషయాల్లో ప్రభుత్వం విఫలమయింది

**మహిళా లోకమంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతుంది**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి:

ఓవైపు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మరోవైపు, తెలంగాణ తల్లుల వంటి ఆశా వర్కర్లను అరెస్ట్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రూ. 18 వేలు జీతం ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపిందని విమర్శించారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పెద్దలు చేపట్టిన పనులకు రూ. వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారని... చిన్నచిన్న పనులు చేసిన సర్పంచ్ లకు మాత్రం బిల్లులు చెల్లించడం లేదని రాజేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల మంది సర్పంచ్ లు ఆందోళన చేస్తున్నారని, వారి గోడును పట్టించుకునే వారే లేరని అన్నారు. అన్ని విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని దుయ్యబట్టారు.గ్రామాల్లో స్ట్రీట్ లైట్లకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. మహిళా లోకమంతా ఏకమై కాంగ్రెస్ ను గద్దె దించుతుందని చెప్పారు.

# హైదరాబాద్-విజయవాడ హైవేపై రోడ్డు ప్రమాదం

**డీలక్స్ బస్సును ఢీకొట్టిన లారీ**

**ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి**

చౌటుప్పల్,డిసెంబర్9(ప్రజావినికిడి: హైదరాబాద్-విజయవాడ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. నల్గొండ నుంచి హైదరాబాద్ వెళుతున్న డీలక్స్ బస్సు.. ముందు వెళుతున్న ఓ లారీని ఢీకొట్టింది. దీంతో ప్రమాదం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ మృతదేహం క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. దీంతో క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నిలిచింది.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా



హైదరాబాద్,డిసెంబర్9(ప్రజావినికిడి:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేశారు. ఈరోజు సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సభలో వెల్లడించారు. ఈ విగ్రహావిష్కరణకు అందరూ రావాలంటూ సభాముఖంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు, సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం నమూనా అంశంపై వివరణ ఇచ్చారు. విగ్రహం నమూనా మార్పుపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు సభ్యులు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారికంగా జరుపుకోవాలని సభలో నిర్ణయించారు. అనంతరం సభను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 10 డిసెంబర్ 2024

# వందే భారత్ స్లీపర్,,, రెడీ టూ స్టార్ట్







**చెన్నై :** వందేభారత్.. ఈ పేరు ఇప్పటికే భారతీయుల నోళ్లలో నానుతోంది. వేగంగా గమ్యస్థానాలకు ప్రయాణికులను చేర్చాలన్న లక్ష్యంతో రైల్వే వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ అత్యాధునిక రైళ్లు పట్టాలపై పరుగులు పెడుతున్నాయిఅత్యాధునిక సౌకర్యాలతో.. ప్రయాణికులను అత్యంత వేగంగా గమ్యస్థానాలకు చేర్చాలన్న లక్ష్యంతో మేకిన్ ఇండియాలో భాగంగా భారత ప్రభుత్వం వందే భారత్ రైళ్లను తయారు చేయించింది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఈ రైళు ఇప్పటికే దేశమంతా పట్టాలపై పరుగులు పెడుతున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు ఉండడంతో చార్జీ కాస్త ఎక్కువైనా ప్రయాణికులు ఇబ్బంది పడడం లేదు. దీంతో వందే భారత్ సక్సెస్ అయింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కొత్తగా వందే భారత్ స్లీపర్‌ను పట్టాలెక్కించబోతోంది. ఇప్పటి వరరకు వందే భారత్ రైళ్లు చైర్‌కార్‌లు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని ఉదయం పూట నడుపుతున్నారు. అయితే స్లీపర్ సౌకర్యాలతో కూడిన రైళ్లను సిద్ధం చేస్తోంది. అందుకు అనుగుణంగా స్లీపర్ వెర్షన్‌ను అన్ని హంగులతో సిద్ధం చేస్తోంది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించి పట్టాలెక్కించ బోతున్నారు. ప్రయాణికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వందేభారత్ స్లీపర్ వెర్షన్ త్వరలో పట్టాలెక్కబోతు న్నాయి. ఇందుకు సంబంధించిన బోగీలు చెన్నై ఐసీఎఫ్ (ఇండిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)లో తుది మెరుగులు దిద్దుకుంటుఅన్నయి. ప్రయోగాత్మకంగా వీటిని ఇప్పటికే మీడియాకు ప్రదర్శించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏకధాటిగా 1,200 కిలోమీటర్లు ప్రయాణించేందుకు అవసరమైన సౌకర్యలతో రూపొందించారు. ఇది గరిష్టంగా గంటకు 160 కిలోమీటర్ల వేగవంతో ప్రయాణిస్తుంది. ఇక బోగీల్లో అత్యధునిక సౌకర్యాలు కల్పించారు. మొబైల్ చార్జింగ్, మేగజైన్లు,. టేబుల్, ఇన్నపాటి లైట్, సామగ్రి కోసం విశాలమైన స్థలం, వేడినీరు, సీసీ కెమెరాలు, అత్యవసర సమయాల్లో డ్రైవర్‌తో మాట్లాడే సౌకర్యం, బయో వాక్యూమ్ టాయిలెట్‌లు ఏర్పాటు చేశారు. 2025, జనవరిలో వీటిని పట్టాలెక్కించేందుకు ఇండియన్ రైల్వే సన్నాహాలు చేస్తోంది. వందే భారత్ స్లీపర్ వెర్షన్ ట్రయల్ రన్ ఇప్పటికే ప్రారంభమైంది. నవంబర్ 15 నుంచి ట్రయల్‌రల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి కాగానే జనవరి 15 నుంచి పట్టాలపై పరుగులు పెడుతుంది. ఇక వాణిజ్య రైళ్లను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు భారత రైల్వే కసరత్తు చేస్తోంది. కేంద్రం అనుమతి ఇస్తే ఫిబ్రవరి నాటికి కమర్షియల్ రైళ్లను కూడా సిద్ధం చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# సిసోడియా సీటు మార్పు, 13 సిట్టింగ్‌లకు దక్కని చోటు



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే కసరత్తు ప్రారంభించిన ఆమ్ ఆద్మీ పార్టీ 20 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను సోమవారంనాడు విడుదల చేసింది. మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సీటును ఈసారి మార్పు చేసింది. ప్రతాప్‌గంజ్ ఎమ్మెల్యేగా ఉన్న సోసిడియా ఈసారి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ప్రతాప్‌గంజ్ నియోజకవర్గాన్ని ఇటీవలే పార్టీలో చేరిన విద్యావేత్త, పాపులర్ యూట్యూబర్ అవథ్ ఓఝూకు కేటాయించారు. పార్టీ అభ్యర్థుల రెండో జాబితాలో జితేందర్ సింగ్ షంటి (షాదరా నుంచి), సురిందర్ పాల్ సింగ్ బిట్టు (తిమర్‌పూర్) పేర్లు చోటుచేసుకున్నాయి. బిట్టు ఇటీవలే బీజేపీ నుంచి ఆప్‌లో చేరారు. ఎస్‌కే బగ్గా కుమారుడు వికాస్ బగ్గాకు కృష్ణానగర్ నుంచి టిక్కెట్ లభించగా, ప్రహ్లాద్ సింగ్ సాహ్నే కుమారుడు పునర్‌దీప్ సింగ్ సాహ్నే నుంచి చౌంద్నీ చౌక్ టిక్కెట్ ఇచ్చారు. పటేల్ నగర్ నుంచి పర్వేష్ రతన్‌ను ఆప్ బరిలోకి దింపిది. పటేల్ నగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, ఢిల్లీ మాజీ మంత్రి రాజ్ కుమార్ ఆనంద్ ఇటీవల ఆప్‌ను వీడి బీజేపీలో చేరారు. గాంధీనగర్ నుంచి నవీన్ చౌదరి, రోహిణి నుంచి ప్రదీప్ మిట్టల్ పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన దీపు చౌదరికి గాంధీనగర్ టిక్కెట్ లభించింది. రాఖి బిద్లాన్‌కు మదిపూర్, ప్రవీణ్ కుమార్‌కు జానక్‌పురి టిక్కెట్ లభించింది. 13 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు రెండో జాబితాలో చోటు దక్కలేదు. వారిలో శరద్ చౌహాన్, దిలీప్ పాండే, పవన్ శర్మ, ధర్మపాల్ లక్ర, ప్రహ్లాద్ సింగ్ సాహ్నే, గిరీష్ సోని, రాజేష్ రిషి, భూపిందర్ సింగ్ జూన్, భావనా గౌర్, ప్రకాష్ జార్వాల్, రోహిత్ కుమార్ మెహ్రౌలియా, ఎస్‌కే బగ్గా, హాజి యూనుస్ ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ 11 మంది అభ్యర్థులతో ఇటీవల తొలి జాబితాను విడుదల చేసింది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి 2025 ఫిబ్రవరికి ముందే ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.

**కేజ్రీవాల్‌కు సిసోడియా కృతజ్ఞతలు**

కాగా, తనపై నమ్మకం ఉంచి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీచేసే బాధ్యత అప్పగించిన పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సిసోడియా కృతజ్ఞతలు తెలిపారు. తనను తాను ఒక రాజకీయవేత్తగా కాకుండా ఒక టీచర్‌గానే భావిస్తుంటానని, ప్రతాప్ గంజ్ తనకు కేవలం అసెంబ్లీ నియోజకవర్గమే కాదని, ఢిల్లీలో విద్యా విప్లవానికి గుండెకాయ వంటిదని చెప్పారు. అవథ్ జోఝూ పార్టీలోకి రావడం, ఎన్నికల్లో పోటీ చేయాలనే డిమాండ్ రావడంతో ఒక టీచర్‌కు ప్రతాప్‌గంజ్‌కు మించిన మంచి నియోజకవర్గం ఉండదని తాను భావించినట్టు ఆయన చెప్పారు.

# రష్యాతో 4 బిలియన్ల డాలర్ల డీల్.. లాంగ్ రేంజ్ రేడార్ సిస్టమ్ కొనుగోలు



న్యూఢిల్లీ: రష్యాతో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకోనున్నది భారత ప్రభుత్వం. సుమారు 4 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆ ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. లాంగ్ రేంజ్ వార్నింగ్ రేడార్ వ్యవస్థను రష్యా నుంచి భారత్ కొనుగోలు చేయనున్నది. ఆ ఒప్పందానికి చెందిన సంప్రదింపులు అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అల్మాజ్-ఆంటే కార్పొరేషన్ కంపెనీ వోరోనేజ్ రేడార్‌లను ఉత్పత్తి చేస్తున్నది. ఏరోస్పేస్ ఎక్విప్మెంట్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైల్ సిస్టమ్స్, రేడార్ల ఉత్పత్తిలో ఆ సంస్థ అగ్రస్థానంలో ఉన్నది. అయితే మిస్సైల్ బెదిరింపుల్ని గుర్తించి, ట్రాక్ చేసేందుకు సామర్థ్యాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే సుదీర్ఘ దూరం నుంచి క్షిపణుల కదలికల్ని రేడార్లతో పసికట్టేందుకు ఈ కొనుగోలు చేపట్టనున్నారు. దాదాపు 8 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలిస్టిక్ క్షిపణులు, విమానాలను వోరోనేజ్ రేడార్ వ్యవస్థ గుర్తిస్తుందని అధికారులు అంటున్నారు. కొన్ని దేశాల వద్దే ఉన్న ఇలాంటి టెక్నాలజీని ఇప్పుడు భారత్ కూడా సొంతం చేసుకోనున్నట్లు రష్యా చెబుతోంది. ఇటీవల అల్మేజ్-ఆంటే బృందం భారత్‌లో పర్యటించింది. మేకిన్ ఇండియాలో భాగంగా సుమారు 60 శాతం రేడార్ వ్యవస్థను భారతీయ కంపెనీల ఉత్పత్తులతోనే నిర్మించనున్నారు. కర్నాటకలోని చిత్రదుర్గలో దీన్ని ఇన్‌స్టాల్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ , ఏరోస్పేస్ సౌకర్యాలు ఉన్నాయి.

## పెద్దల సభకు ఏపీ, హర్యానా, ఒడిశా

# అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ




**న్యూఢిల్లీ:** రాజ్యసభకు జరిగే ఉప ఎన్నికల్లో మూడు రాష్ట్రాల నుంచి పోటీ చేసే తమ అభ్యర్థుల పేర్లను భారతీయ జనతా పార్టీ సోమవారంనాడు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా నుంచి వీరు పోటీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య, ఒడిశా నుంచి సుజీత్ కుమార్, హర్యానా నుంచి రేఖా శర్మ పోటీ చేస్తున్నారు.

**రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్**

షెడ్యూల్ ప్రకారం రాజ్యసభకు ఉప ఎన్నికలు డిసెంబర్ 20న నిర్వహిస్తారు. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఆరుగురు సభ్యులను రాజ్యసభకు ఎంపిక చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి 3 సీట్లు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఎంపీలను రాజ్యసభకు పంపాల్సి ఉంది. జగన్ మోహన్ రెడ్డి వైఎస్‌ఆర్‌సీపీకి చెందిన ఎంపీలు వెంకటరమణ రావు మోపిదేవి, బీద మస్తాన్ రావు యాదవ్, రాగ్య కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామా చేయడంతో ఆ మూడు స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీడీపీ ఈ మూడు సీట్లు గెలుచుకోవడం ఖాయమనే చెప్పాలి.

**ఒడిశా:** నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజు జనతా దళ్ (బీజేడీ) ఎంపీ సుజీత్ కుమార్ రాజ్యసభకు రాజీనామా చేశారు. బీజేపీ ఈ సీటును గెలుచుకునే అవకాశం ఉంది.

పశ్చిమబెంగాల్: అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన జవహర్ సర్కార్ రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో ఈ సీటును టీఎంసీ సునాయాసంగా గెలుచుకోనుంది.

హర్యానా: అధికార బీజేపీకి చెందిన కృష్ణలాల్ పన్వర్ రాజ్యసభ సీటుకు రాజీనామా చేశారు. ఈ సీటను బీజేపీ తిరిగి నిలబెట్టుకోనుంది. హర్యానాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజ్యసభ సీటుకు పన్వర్ రాజీనామా చేసారు. ప్రస్తుతం ఆయన నయబ్ సింగ్ సైని మంత్రివర్గంలో అభివృద్ధి, పంచాయతీరాజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రిగా ఉన్నారు.

# జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై 'ఇండియా' కూటమి అవిశ్వాస తీర్మానం



**న్యూఢిల్లీ:** రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ఎగువసభలోని 'ఇండియా' కూటమి నేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ తీర్మానంపై ఇంతవరకూ 50 మంది ఎంపీలు సంతకాలు చేసినట్టు కూడా చెబుతున్నారు. రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టేం దుకు కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయని తెలుస్తోంది. "అవిశ్వాస తీర్మానానికి సంబంధిం చిన ముసాయిదా (డ్రాఫ్ట్) సిదమైంది. 50 మంది ఎంపీలు కూడా సంతకాలు చేశారు. దీనిపై చర్చలు సైతం జరుగుతున్నాయి" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

**విపక్ష నేతల అభియోగం**

రాజ్యసభలో మాట్లాడేందుకు తమకు సమయం కేటాయించే విషయంలో జగ్‌దీప్ ధన్‌ఖడ్ వివక్ష చూపుతున్నారని, తాము మాట్లాడుతుంటే అడుగడుగునా అడ్డుకుంటున్నారని విపక్ష నేతల అభియోగంగా ఉంది. కేవలం అధికార పక్షం (ట్రెంజరీ బెంచ్) మాట్లాడేందుకే అవకాశం ఇచ్చి, విపక్ష నేతలకు ఏమాత్రం సమయం ఇవ్వక పోవడమే కాకుండా వారికి క్లాస్ తీసుకుంటారని ఆగ్రోశిస్తున్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్లుగా మహిళలు



**న్యూఢిల్లీ:** మహిళా సాధికారత దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో కీలక పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. బీమా సఖి యోజన అనే పథకాన్ని హర్యానాలోని పానిపట్‌లో జరిగిన సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో ప్రధాని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఈ పథకం ద్వారా ఉపాధి లభించనుంది. 18 నుంచి 70 ఏళ్ల లోపు మహిళలు ఈ పథకం ద్వారా ఎల్ఐసీ ఏజెంట్లుగా ఉపాధి పొందుతారు. మహిళలలో అక్షరాస్యతా పెంపు, ఆర్థికంగా బలపడేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాది, ఉద్యోగావకాశాలు కల్పించడం, స్థిరమైన ఆదాయం ఉండేలా చూడటం పథకం ముఖ్యోద్దేశం. మహిళా ప్రగతికి అవరోధమైన సామాజిక ఇబ్బందులను తొలగించడం ప్రధానోద్దేశంగా ఈ పథకం రూపొందినట్టు ప్రధాని తన ప్రసంగంలో తెలిపారు "గతంలో కొన్ని పనులను మహిళలకు అప్పగించే విషయంలో ఆటంకాలు ఎదురయ్యేవి. మన ఆడకూతుళ్లకు అలాంటి అవరోధాలను తొలగించాలని బీజేపీ నిర్ణయించింది. ప్రతి రంగంలోనూ మహిళలు రాణించేలా చేసేందుకు కట్టుబడి ఉన్నాం. లింగ సమానత్వం, వివిధ రంగాల్లో మహిళా సాధికారతను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చాం" అని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఒక ప్రత్యేకత కూడా ఉందని, భారతీయ గ్రంథాలు తొమ్మిదో సంఖ్యను అత్యంత శుభప్రదంగా భావిస్తాయని, 9వ సంఖ్య దుర్గామాత శక్తికి తార్కాణమని, సాధికారత, శక్తికి సంకేతమని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీనాడే రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగిందని చెప్పారు.

**ఏక్ హై తో సేఫ్ హై**

?'ఏక్ హై తో సేఫ్ హై' నినాదాన్ని అక్కున చేర్చుకున్న హర్యానా రాష్ట్రాన్ని మోదీ అభినందించారు. ఐక్యత, భద్రత అనేవి యావద్దేశానికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. భగవద్గీతను ప్రబోధించిన కురక్షేత్రలో అంతర్జాతీయ గీతా మహోత్సవ్ జరుగుతున్న తరుణంలో మహిళా సాధికారతకు దోహత పడే ఎల్ఐసీ బీమా సఖి యోజన పథకం ప్రారంభం కావడం మరో విశేషమని చెప్పారు. ఎల్ఐసీ బీమా యోజన పథకం కింద కనీసం 10వ తరగతి చదివిన మహిళలలకు మూడేళ్ల శిక్షణ ఇస్తారు. అనంతరం ఎల్ఐసీ ఏజెంట్లుగా నియమిస్తారు. శిక్షణా కాలంలో స్టయిఫండ్, పాలసీ అమ్మకాల ఆధారంగా కమిషన్ ఇస్తారు.

## ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్బీఐ గవర్నర్ గా బాధ్యతలు నిర్వర్తించిన శక్తికాంత దాస్ స్థానాన్ని సంజయ్ మల్హోత్రా భర్తీ చేయనున్నారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్ గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పదవీకాలం పూర్తయినప్పటికీ, మరికొన్నాళ్ల పాటు పదవీకాలం పొడిగించారు. పొడిగించిన పదవీకాలం రేపు డిసెంబరు 10తో ముగియనుంది. శక్తికాంత దాస్ స్థానంలో ఆర్బీఐ పగ్గాలు అందుకోబోతున్న సంజయ్ మల్హోత్రా పదవీకాలం బుధవారం ప్రారంభం కానుంది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకుకు 26వ గవర్నర్ గా సేవలు అందించనున్నారు. సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆయన ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్స్ టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ అయిన సంజయ్ మల్హోత్రా... తన 33 ఏళ్ల కెరీర్ లో విద్యుత్, ఆర్థిక, పన్నులు, సమాచార సాంకేతికత, గనుల శాఖలో విధులు నిర్వరించారు.

## ఈ సెషన్‌లోనే పార్లమెంట్ ముందుకు 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లు



'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వచ్చే పార్లమెంట్ సెషన్‌లో బిల్లును కచ్చితంగా ఉభయసభల ముందుకు తీసుకురావాలని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతోపాటే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకే దఫా ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఈ బిల్లుకు సంబంధించి పలు సిఫారసులు చేసింది. అనంతరం బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇక బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయిగా ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర పడితే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి ముందు బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పంపాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. జేపీసీ అన్ని పార్టీల ప్రతినిధులతో ఈ బిల్లుపై చర్చించి అందరి అంగీకారాన్ని తీసుకోనుంది. అంతేగాక అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్‌ల నుంచి ప్రభుత్వం ఈ బిల్లుపై అభిప్రాయాలు కోరింది. మేథావులు, నిపుణులు, పౌర సమాజ సభ్యులు తదితరులను కూడా ఈ బిల్లుపై చర్చలో భాగస్వాములను చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ తర్వాత సాధారణ ప్రజానీకం నుంచి కూడా ఈ బిల్లుపై అభిప్రాయాలను కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు...



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 125 డివిజన్ గాజులరామారం చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర కేకేసి వైస్ చైర్మన్ గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలు అలాగే పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, అనంతరం కేక్ కటింగ్ లో పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా.అవిజె జేమ్స్,డివిజన్ అధ్యక్షులు ఎండి లాయక్,పండరి రావు, సంతోష్ ముదిరాజ్,శ్రీధర్ రెడ్డి, ఈశ్వర్,బల్ రెడ్డి, అజయ్,నరేందర్ రెడ్డి, వేణు గౌడ్,శ్రీనివాస్ గుప్తా,బుచ్చి రెడ్డి, అనిల్ రెడ్డి,రహీమ్, ఖలీమ్,గఫ్ఫార్, అనిల్,అరుణ్,మహిళ కాంగ్రెస్ నాయకురాలు లలిత,ఫారీన్ ఖాన్, శ్యామల,శ్రీలత, శైలజ,శరధ, వెంకటలక్ష్మి,లతా, అశ్విని మరియు కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

## ఆశాలపై ప్రభుత్వ అధికారుల వేధింపులకు

# నిరసనగా దిష్టిబొమ్మ దహనం..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
ఆశాలపై ప్రభుత్వ అధికారుల వేధింపులకు నిరసనగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ సాగర్ హోటల్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల నాయకులు ఈ దేవదానం పసుల అంజయ్య పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆశాలు చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారని చాలా సంవత్సరాల నుండి ఆశలకు కనీస వేతనం అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యమాలు,పోరాటాలు నిర్వహించిన ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించింది ఆశాలేనని ఇప్పటికీ లెప్రసీ హెచ్ఐవి రోగులను అక్కున చేర్చుకుని వాళ్లకు కావాల్సిన వైద్యాన్ని అందిస్తున్నది ఆశలేనని అలాంటి ఆశ వర్కర్లను ప్రభుత్వ అధికారులు హీనంగా చూస్తూ ఈసాడింపులకు అవమానాలకు గురి అవుతున్నారని తమ చెప్పు చేతలలో మెలగకపోతే వాళ్ల యొక్క ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశాలపై పెత్తనం తగ్గించాలని లేనిపక్షంలో అధికారులు అనధికారికంగా చేస్తున్న వ్యాపారాలను బహిర్గతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కీలుకాని లక్ష్మణ్,శ్రీనివాస్ ఖలీల్,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా

## ఏరియా హాస్పిటల్ లో రోగులకు పండ్లు బ్రెడ్ ల పంపిణీ..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్): సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా టీపీసీసీ చైర్మన్ మాజీ పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు మధుయాష్కీ గౌడ్ పిలుపుమేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ లో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ రోగులకు పండ్లు అలాగే బ్రెడ్ ప్యాక్ లు సుమారుగా 200 మందికి హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్.నేలపాటి రామారావు,బుడ్డ సత్యనారాయణ మరియు పాశం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ లు మాట్లాడుతూ సోనియా గాంధీ దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారని తెలిపారు. ఈ రాష్ట్రం లో ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ లు పూర్తిగా అమలు చేయడం జరిగింది. మహాలక్ష్మి పతకం ద్వార మహిళలకు ఆర్ టి సి బస్ ఉచిత ప్రయాణం.రైతులకు రుణాలను మాఫీ చేయడం జరిగింది.200.యూనిట్ కరెంట్ బిల్లు పూర్తిగా మాఫీ చేయడం జరిగింది.500 రూపాయలు కు గ్యాస్ సరఫరా చేయడం జరిగింది. రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షల రూపాయలు వరకు చేయడం జరిగింది. అన్ని కూడా ప్రజా ప్రభుత్వం లో ప్రజలకు న్యాయం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు.కుట్ల నర్సింహా యాదవ్, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు కోలన్ సుధాకర్ గౌడ్,చర్ల రమేష్,ఎర్రబెల్లి ప్రగతి, భుజంగ రెడ్డి,పద్మ రెడ్డి,మధు,వెంకటేష్ గౌడ్,జాల వెంకటరెడ్డి, సురేంద్ర,వినేష్ రెడ్డి, ప్రశాంత్,సుధీర్. రత్న,లావణ్య,గోపాల్ రెడ్డి,వినీష్ రెడ్డి, సురేంద్ర,సుధీర్, ప్రశాంత్, వెంకటేశ్వరావు మరియు డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం..

## సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన కామ్రేడ్ పి.సత్యం..




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభలు ముగిసిన సందర్భంగా సిపిఎం నూతన జిల్లా కార్యదర్శి పి.సత్యం,ప్రగతి నగర్ సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలనుఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రగతి నగర్ అంబీర్ చెరువు కాలుష్య నివారణకై చర్యలు తీసుకోవాలని, జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల 10 కిలోమీటర్ల పరిధిలో జనావాసాల్లో మురికి కాలుష్యం, దుర్గంధం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని డంపింగ్ యార్డ్ ను నగరం నలు మూలలకు నాలుగు యార్డులుగా ఏర్పాటుచేసి విభజించాలని,గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుటుంబానికి 20వేల లీటర్లు నెలకు ఉచితంగా ఇస్తున్నారని ఆ పథకం శివారు మున్సిపల్ ప్రాంతాలన్నింటికీ అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలని తీర్మానించడమైనదన్నారు.అంతేకాకుండా ఆశ వర్కర్స్ పై జిల్లా అధికారులు వేధింపులు ఎక్కువయ్యాయని, కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే దానికోసం ప్రభుత్వము,అధికారులు ప్రయత్నం చేస్తున్నారని కార్మికులను ఐక్యపరిచి పోరాటాలతోనే తిప్పికొడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా కార్మికులకు 18000 ఫిక్స్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు.ఆశ వర్కర్లపై వేధింపులు ఆపకపోతే సిపిఎం పార్టీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడుతుందని హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్,జి. శ్రీనివాసులు మాట్లాడుతూ,మేడ్చల్ జిల్లా పారిశ్రామికంగా విస్తరించి ఉన్నదని వేలమంది కార్మికులు పరిశ్రమల్లో పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేయట్లేదని, ప్రభుత్వం పట్టనట్లు కార్మికులపై నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. వలస కార్మికుల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాలు,కనీస వేతనాల మండలి సూచించిన 18 వేల రూపాయలు అమలు చేయకుండా,ప్రస్తుతం ఉన్న వేతనాలనే కనీస వేతనాలుగా జీవో ఇచ్చిందని ఎద్దేవా చేశారు. వెంటనే కనీస వేతన మండలిని ఏర్పాటు చేసి కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ఉత్పత్తి లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని లేనిపక్షంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి బి. వెంకట్రామయ్య మాట్లాడుతూ నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.జిహెచ్ఎంసి పరిధిలో మాదిరిగానే కుటుంబానికి 20వేల లీటర్లు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతి నగర్ అంబీర్ చెరువు దగ్గర నుండి జేఎన్టీయూ వరకు రోడ్డు విస్తరణ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ట్రాఫిక్ సమస్యను నివారించి ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కొరకు, మాదకద్రవ్యాల మాఫియాను సమూలంగా నియంత్రించి భవిష్యత్ తరాల యువత విద్యార్థుల జీవితాలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.మహాసభలో నూతన కార్యదర్శి వర్గంగా కే. రవి,జె.చంద్రశేఖర్, అశోక్,వినోద, రాజశేఖర్,జి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మరియు నూతన కమిటీగా ఆర్ సంతోష్, బి. వెంకటరామయ్య,ఆర్.వరప్రసాద్, కీలు కానీ లక్ష్మణ్,ఎంపీ నరేష్, ఏం శంకర్, లింగస్వామి,ఎన్ సబిత,జే వెంకన్న,జీ లక్ష్మణ్,ఎన్ శ్రీనివాస్ నూతనంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు సిపిఎం బాచుపల్లి మండల నాయకులు ఎం చంద్రశేఖర్ బాల వెంకటేశ్వర్లు మల్లయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామరం 125 డివిజన్ లో ఘనంగా

# ప్రజా పాలన.. ప్రజా విజయోత్సవాలు..

ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామరం 125 డివిజన్ లో 'ప్రజా పాలన%-%ప్రజా విజయోత్సవాల వేడుకలు కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ముందుగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఏడాది కాలంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి పథకాలను గురించి కూన శ్రీనివాస్ గౌడ్ వివరించారు. అనంతరం సోనియాగాంధీ 79వ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో అభివృద్ధి పథంలో నడుస్తోందని అన్నారు.పేద మధ్యతరగతి కుటుంబాలు సంతోషంగా



ఉన్నారని తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంవత్సరంలోనే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ చేయలేని అభివృద్ధి కాంగ్రెస్ చేస్తుందని కూన శ్రీనివాస్ గౌడ్ ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ బుచ్చిరెడ్డి,డాన్ శీను రవి నారాయణ రెడ్డి నగర్ వైస్ ప్రెసిడెంట్ , ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్,గూడ ఐలయ్య గౌడ్,రవి నారాయణ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, టిపిసిసి కార్యదర్శి పున్నారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు దమ్మనిశ్రవణ్ కుమార్, రషీద్ బేగ్,యం. సాగర్,తోఫిక్, జహంగీర్,పూలమ్మ, పద్మ, లాల్ మహమ్మద్,కృష్ణ యాదవ్, శ్యామల,గుమస్తా మధుసూదన్,చాంద్ భాషా,బండి శ్రీనివాస్ గౌడ్,గంగారాం, కాజా భాయ్,షాకీర్,మల్లం శ్రీను,శివ నాయక్, సతీష్, మల్లారెడ్డి,ఈగ ఆంజనేయులు, అరుణ్ కుమార్, లింగం యాదవ్, వెంకటేష్ యాదవ్, భూషణం గౌడ్,రాధిక, కల్పనా రెడ్డి,సంతోష్, రాజి రెడ్డి,చక్రి, రాజేందర్ రెడ్డి, మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్ గౌడ్ సల్మాన్,చోటు,పులి సందీప్,నరేష్ గౌడ్, సంతోష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నషాముక్త భారత్.. ప్లాస్టిక్ రహిత సమాజ కార్యక్రమం..

## కార్యక్రమం నిర్వహించిన విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్

హాజరైన షాద్ నగర్ పట్టణ విశ్వహిందూ పరిషత్,ఆర్ఎస్ఎస్ నేతలు..
కార్యక్రమంలో సీఐ విజయకుమార్, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్,ఎస్ఐ సుశీల హాజరు..







ప్రజావినికిడి,(షాద్ నగర్):
విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నశాముక్త భారత్ అలాగే ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా షాద్ నగర్ పట్టణ సి.ఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ సుశీల, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారు రమేష్, ఆర్.ఎస్.ఎస్.రాష్ట్ర సేవా ప్రముఖ్ శివశంకర్,ఆర్ఎస్ఎస్ కమలాకర్,బజరంగ్ దళ్ విభాగ్ సంయోజక్ గూడెం రమేష్,జిల్లా సురక్ష ప్రముఖ్ ప్యాట వంశీ మాట్లాడుతూ, యువత డ్రగ్స్,మత్తు పానీయాలకు, ధూమపానాలకు ఎలాంటి చెడు అలవాట్లకు అలవాటు కాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు.సి.ఐ విజయ్ కుమార్ పలు ఆసక్తికరమైన విషయాలను వివరించారు.ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలి అని సూచించారు.అలాగే సమాజ అభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు సూచించారు.ట్రాఫిక్ సిఐ పలు వాహనాలకు సంబంధించిన నిబంధనలను వివరించారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ లోని ఇంటర్మీడియట్ కళాశాలలు విజేత, విశ్వభారతి,విజ్ఞాన్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి బాలబ్రహ్మ చారి, ఆకుల మల్లికార్జున బజరంగ దళ్ ప్రఖండ సంయోజక్ రోలు గిరి, విశ్వహిందూ పరిషత్ షాద్ నగర్ అధ్యక్షులు ఎముల సందీప్ కుమార్,ప్రధాన కార్యదర్శి హృషీకేష్, షాద్ నగర్ బజరంగ్ దళ్ సంయోజక్ వినయ్,కార్యకర్తలు కుర్వగడ్డ భాను, దిలీప్,సురేష్ పవన్, చరణ్,జానంపేట చరణ్,కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ఎంత మందిని కనాలో కూడా మీరే నిర్ణయిస్తారా?




**నేడే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం**

హైదరాబాద్,డిసెంబర్9ప్రజావినికిడి:
ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం నరజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహసిక్తం' అన్నారు మహాకవి శ్రీశ్రీ. రక్తం ఏరులైపారు తున్నా, బాంబులకు శరీరాలు శకలాలుగా మారుతున్నా? ఆగని హక్కుల పోరాటం. కొండలు గుట్ట ల్లోని విలువైన ఖనిజాల కోసం హక్కుల హననం ఒకవైపు, మతం పేరుతో మైనార్టీల హక్కులపై నిరంతర దాడి మరోవైపు? యధేచ్ఛగా సాగిపోతోంది. గాజా నుంచి మణిపూర్ వరకూ సాగుతోన్న మారణహోమం మనకిదే గుర్తు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నేడు మానవ హక్కులపై దాడి జరుగుతోంది. జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ వివక్షలకు గురవుతూనే వున్నారు. యుద్ధం జరుగుతున్న ప్రతిచోటా మొదటి బాధితులు బాలలు, మహిళలే. ఎవరినీ చిత్ర హింసలకు గురిచేయరాదు. ఎవరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన శిక్షకు గురిచేయరాదని ఐక్యరాజ్య సమితి రూపొందించిన మానవ హక్కుల పత్రం స్పష్టం చేస్తోంది. అందరి హక్కులు కాపాడతామని ఐరాస సభ్యదేశాలు సంకల్పం తీసుకున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తోన్న జాతి హననంపై ఐక్యరాజ్యసమితితో పాటు మానవహక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా? మానవ హక్కుల పరిరక్షకులుగా ఫోజు పెట్టే అమెరికా కానీ, ఇతర పశ్చిమ దేశాలు కానీ ప్లలెత్తు మాట అనడంలేదు. మరోవైపు, మణిపూర్ తగలబడుతోంటే భారత్‌లో ప్రజాస్వామ్యం విలసిల్లుతోందని గొప్పలు చెప్పుకుంటూ విదేశీ పర్యటనల్లో మునిగితేలుతున్నారు ప్రధాని నరేంద్రమోడీ. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా కలిగిన భారత్ ఇప్పటికే ఆహార అభద్రత, పర్యావరణం, నిరుద్యోగం, పిల్లల్లో రక్తహీనత వంటి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే, ఇది చాలదన్నట్లు? ఇకనుంచి కొత్త జంటలు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.. అస్సాంలో బీఫ్ తినడంపై నిషేధం విధించింది అక్కడి బిజెపి ప్రభుత్వం. వాస్తవానికి అక్కడ బీఫ్ తినడం నిషేధం కాదు. ఉత్తరప్రదేశ్‌లో ఒక హిందువు ఇంటిని ఓ ముస్లిం డాక్టర్ కొనుక్కున్నాడని నానాయాగీ చేసి, ఆ ఇంటిని తిరిగి ఇప్పించేశారు. దేశంలో ప్రతిరోజూ? ప్రతిచోటా హక్కుల ఉల్లంఘన సాగిపోతూనే వుంది. ప్రజలు ఏమి తినాలో, ఏమి ధరించాలో, ఏ యిల్లు కొనుగోలు చేయాలో? చివరకు ఎంతమంది బిడ్డలను కనాలో కూడా వారే నిర్ణయించేస్తూ? హక్కులను పాతరేస్తున్నారు. 'మన పోరాటం డబ్బుకోసం కాదు, అధికారంకోసం కాదు? స్వేచ్ఛ, మానవత్వ పునరుద్ధరణలే మన లక్ష్యాలు' అంటారు అంబేద్కర్. సృష్టిలోని ప్రతి వ్యక్తికీ హక్కులుంటాయి. ఒక వ్యక్తి అభివృద్ధి సాధించాలంటే, ఆహారం, విద్య, వైద్యం, నైపుణ్యం, స్వేచ్ఛ వంటి సదుపాయాలతో పాటు ముఖ్యంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ వుంటుంది. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి మానవీయ విలువలను సమర్థించే ప్రజాస్వామ్య వ్యవస్థలో కనుమరుగవుతున్న ఈ హక్కుల కోసం పోరాటం చేయాల్సివస్తోంది. సమానత్వం, భావప్రకటన, వ్యక్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ వంటివి రాజ్యాంగం ఈ దేశ పౌరులకు ప్రసాదించిన హక్కులు. ఒక వ్యక్తి హుందాగా, స్వేచ్ఛగా బతకడానికి అవి కనీసావసరం. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగం. అణచివేతలేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగించే కృషికి గుర్తుగా ప్రతి యేడాది డిసెంబర్ 10ని 'మానవహక్కుల దినోత్సవం'గా ప్రపంచమంతా పాటిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి, విధ్వంసం నుంచి కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం మేల్కొనాలి.

# మంత్రివర్గంలోకి నాగబాబు



**చంద్రబాబు కీలక నిర్ణయం ,అధికారికంగా ప్రకటన విడుదల**
**దాంతో నాలుగుకు పెరిగిన జనసేన మంత్రుల సంఖ్య**
**బీద కు మరో చాన్స్ పెద్దల సభకు సానా సతీష్**




అమరావతి డిసెంబర్9ప్రజావినికిడి:
మెగా బ్రదర్ నాగబాబు మంత్రి పదవి చేపట్టడం ఖాయమైంది. నాగబాబుకు రాజ్యసభ చాన్స్ ఇస్తారంటూ జరిగిన ప్రచారానికి నేటితో తెరపడింది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సీఎం చంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పాతికమంది మంత్రులకు అవకాశం ఉంది. ప్రస్తుతం చంద్రబాబు క్యాబినెట్ లో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేన పార్టీకి 4 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా ఉన్నారు. ఇప్పుడు జనసేన నుంచి నాలుగో మంత్రిగా నాగబాబు క్యాబినెట్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. .టిడిపి రాజ్యసభ సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను తెలుగు దేశం పార్టీ ప్రకటించింది. రాజ్య సభ స్థానానికి రాజీనామా చేసి వైసిపి నుంచి టీడీపీ లోకి చేరిన బీద మస్తాన్ రావు మరోసారి అవకాశం ఇచ్చారు చంద్రబాబు. ఇక కాకినాడ లోకసభ సీటు ఆశించి సమీకరణ లతో జన సేన అభ్యర్థికి దక్కడం తో డీలపడిన సానా సతీష్ ను పెద్దల సభకు పంపనున్నారు. ఈ మేరకు ఈ ఇద్దరు పేర్లను ఖరారు చేస్తూ టీడీపీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇక మూడో సీటు బీజేపీ. కి కేటాయించగా ఆర్ కృష్ణయ్య ను ఆ పార్టీ బరిలోకి దింపింది.రేపు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

# ఏపీ రాజ్యసభ బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య

**ఏపీలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలు**
**పార్టీలో చేరిన ఆర్.కృష్ణయ్యకు సముచిత గౌరవం ఇచ్చిన బీజేపీ**
**ఎన్నికల తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేసిన కృష్ణయ్య**



అమరావతి,డిసెంబర్9ప్రజావినికిడి:
వైసీపీని వీడి బీజేపీలో చేరిన మాజీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ఆ పార్టీ సముచిత గౌరవాన్ని ఇచ్చింది. ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కృష్ణయ్యను బీజేపీ ప్రకటించింది. గతంలో ఆయన వైసీపీ తరపున రాజ్యసభకు వెళ్లారు. ఎన్నికల తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి ఆయన రాజీనామా చేశారు. మరోవైపు హర్యానా నుంచి రేఖాశర్మను, ఒడిశా నుంచి సుజిత్ కుమార్ ను రాజ్యసభ అభ్యర్థులుగా బీజేపీ నాయకత్వం ఎంపిక చేసింది. వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వాలకు ఆర్ కృష్ణయ్యతో పాటు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావులు కూడా రాజీనామా చేయడం తెలిసిందే. మోపిదేవి, బీద మస్తాన్ రావు టీడీపీలో చేరారు.

# రాజన్న కోడెలను కబేళాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు

**నిబంధనలకు విరుద్ధంగా అప్పగించినట్టు పలు ఆధారాలు**

హైదరాబాద్,డిసెంబర్9ప్రజావినికిడి:
వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆగస్టు 12న 60 కోడెలను రాంబాబు అనే వ్యక్తికి ఆలయ ఈవో అప్పగించారు. మంత్రి మెప్పు కోసం నిబంధనలకు విరుద్ధంగా కోడెలను అప్పగించినట్టు తెలుస్తోంది. దీంతో మంత్రి కొండా సురేఖ సిఫార్సుతో రాజన్న ఆలయ కోడెలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసుతో తెచ్చిన 60 కోడెల్లో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగిలిన వాటి గురించి ఆరాతీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు గోశాల నిర్వాహకుడు వీటి రాజన్న కోడెల గురించి పొంతన లేని సమాధానాలు చెప్పడం అనుమానాలను పెంచుతోంది. గోశాల ముసుగులో గోవులను కబేళాలకు తరలిస్తున్నట్టు అతనిపై ఆరోపణలు వస్తున్నాయి. గీసుకొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబుకు వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన 60 కోడెలను ఇచ్చారు. కానీ.. అతను చెప్పిన గోశాలలో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగతా గోవులను విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన గతేడాది ఫిబ్రవరి 1న తమ కుటుంబ సభ్యుల పేరుతో రాజేశ్వర సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది. గీసుకొండ మండలం గట్టుకిందిపల్లెలో డీబీఎం-38 సబ్ కెనాల్ పక్కన నాలుగు నెలల కిందట చిన్నపాక వేశారు. అందులోనే చిన్న గోశాల ఏర్పాటు చేశారు.. తర్వాత వేములవాడ ఆలయం నుంచి 60 కోడెలను తీసుకొచ్చారు. అందులో 49 కోడెలను అమ్ముకున్నారని.. విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో.. మంద స్వామి, రాంబాబు కలిసి ఐదేళ్ల కిందట హనుమాన్ గోశాలను నిర్వహించారు. పలు ఆలయాల నుంచి గోవులను తీసుకొచ్చి సంరక్షణ పేరిట వీరు కబేళాలకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. కబేళాలకు అమ్ముతుండగా తాము అడ్డుకుని పోలీసులకు పట్టిచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో.. హనుమాన్ గోశాలను మూసివేశారు. మళ్లీ కొత్తగా గట్టుకిందిపల్లెలో గోశాల ఏర్పాటు చేసి.. దీని ద్వారా దందా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. తాను వేములవాడ నుంచి 60 కోడెలను తీసుకొచ్చింది వాస్తవమేనని గోశాల నిర్వాహకుడు రాంబాబు చెబుతున్నారు. కానీ.. ప్రస్తుతం తన వద్ద 11 ఉన్నాయని అంటున్నారు. తాను తీసుకొచ్చిన వాటిల్లో 26 కోడెలను తిరిగి వేములవాడలోని గోశాలలో అప్పగించానని చెబుతున్నారు. మిగతా వాటిల్లో కొన్ని చనిపోగా.. మరికొన్ని తీసుకొస్తుండగానే పారిపోయినట్లు వింత సమాధానాలు చెప్పారు. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో.. పోలీసులు దృష్టి సారించారు. 49 కోడెలను అమ్మేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్నామని, రాంబాబు ఒక్కరికే 60 కోడెలను ఎలా ఇచ్చారనే విషయమై వేములవాడ ఈవోకు లెటర్ రాశామని పోలీసులు చెబుతున్నారు. ఈవో నుంచి రిప్లై వచ్చాక.. దాన్నిబట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే.. ఈ వ్యవహారంలో మంత్రి సురేఖ సిఫారసు లెటర్ కీలకంగా మారింది. మంత్రి రాంబాబుకు లెటర్ ఎందుకు ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

# బలపడుతున్న అల్పపీడనం..

## ఈ నెల 15 వరకు వర్షాలు

అమరావత్,,డిసెంబర్9ప్రజావినికిడి:
బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడుతోంది. దీని ప్రభావంతో ఈనెల 11 నుంచి నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం ఆనుకుని తూర్పు ఈక్వటోరియల్ హిందూ మహాసముద్రంలో అల్పపీడనం కొనసాగుతోందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా పయనించి రానున్న 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు.ఈనెల 11నాటికి శ్రీలంక-తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి చేరే అవకాశముందన్నారు. దీని ప్రభావంతో డిసెంబర్ 15 వరకు కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కోతకు వచ్చిన పంట చేతికి అందకుండా పోతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### కలెక్టర్లకు సీఎం కీలక ఆదేశాలు

వర్ష సూచన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఇప్పటికే పంట కోసి ధాన్యాన్ని రాసులుగా పోసి ఉంటే ఆ ధాన్యం వర్షాలకు తడవకుండా కాపాడేందుకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ధాన్యపు రాశులను వర్షాలకు తడవకుండా సమీప రైసు మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. అలాగే,



ఎక్కడైనా రైతులు కోతలు కోసి ధాన్యాన్ని రాసులుగా వేసి ఉంటే ఆ ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు సమకూర్చాలని నిర్దేశించారు. వర్షాలు పడే సమయంలో రైతులెవరూ పంట కోత చేయకుండా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

# పవన్ కల్యాణ్ ను చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్...

## పోలీసులను అలర్ట్ చేసిన హోంమంత్రి అనిత



అమరావత్,,డిసెంబర్9ప్రజావినికిడి:
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను చంపేస్తామంటూ ఇవాళ ఆయన కార్యాలయానికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. అంతేకాదు, పవన్ ను ఉద్దేశించి అభ్యంతరకర రీతిలో ఆ వ్యక్తి సందేశం కూడా పంపినట్టు తెలిసింది. ఈ బెదిరింపు కాల్స్ వ్యవహారాన్ని డిప్యూటీ సీఎం కార్యాలయ సిబ్బంది పవన్ కల్యాణ్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.
పవన్ కార్యాలయానికి బెదిరింపు కాల్స్ రావడం పట్ల హోంమంత్రి అనిత స్పందించారు. ఈ వ్యవహారంపై ఆరా తీశారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వారితో మాట్లాడిన అనిత, వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. హోంమంత్రి ఆదేశాల నేపథ్యంలో, పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. పవన్ కార్యాలయానికి బెదిరింపు ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని కృష్ణలంక పోలీసులు గుర్తించారు. విజయవాడ లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్ లో ఉంటున్న మల్లికార్జున్ ఈ కాల్ చేసినట్టు నిర్ధారించారు. దాంతో, మల్లికార్జున్ ఫోన్ ట్రాక్ చేసేందుకు ప్రయత్నించగా... మల్లికార్జున్ ఫోన్ స్విచాఫ్ చేశాడు.





# ది గర్ల్‌ఫ్రెండ్ టీజర్ రిలీజ్

యానిమల్, పుష్ప 2 ది రూల్ సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్‌లు అందుకుంది నేషనల్? క్రష్? రష్మిక మందన్నా. అయితే ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్ చేస్తుంది ఈ భామ. రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. నయనం నయనం కలిసే తరుణం.. ఎదనం పరుగై పెరిగే వేగం. నా కదిలే మనసుని అడిగా సాయం. ఇక మీదట నువ్వే దానికి గమ్యం అంటూ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. స్టోరీ ఏం రివీల్ చేయకుండా టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. ఇందులో రష్మిక బాయ్ ?ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటించబోతున్నాడు. గీత ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు.

# ట్రిపుల్‌ఆర్‌పై డాక్యుమెంటరీ

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి నేటికి 6 ఏండ్లు అవుతున్న సందర్భంగా.. చిత్రయూనిట్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాపై డాక్యుమెంటరీ రాబోతున్నట్లు ప్రకటించింది. ప్రపంచం మొత్తం ఈ సినిమా కీర్తిని చూసింది. ఇప్పుడు లోతులను చూస్తారు అంటూ పేరిటా డాక్యుమెంటరీ చిత్రంను అనౌన్స్ చేసింది. ఇక ఈ డాక్యును డిసెంబర్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ మూవీ డాక్యుమెంటరీ హాక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




# బుట్టబొమ్మ బాలీవుడ్ అనౌన్స్‌మెంట్..!

'రాధేశ్యామ్' తర్వాత పెద్దగా కనిపించని బుట్టబొమ్మ పూజా హెగ్డే మళ్లీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలుగులో ఈ అమ్మడు పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. కానీ తమిళ్, హిందీలో మాత్రం ఈ అమ్మడు రెగులర్‌గా సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంటూ ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి తమిళ్ స్టార్ హీరో సినిమా కావడం విశేషం. ఇప్పుడు హిందీలో యంగ్ స్టార్ హీరో వరుణ్ ధావన్‌కి జోడీగా నటించే అవకాశం దక్కింది. ఈ విషయాన్ని పూజా హెగ్డే స్వయంగా సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. వరుణ్ ధావన్ ఇటీవల సమంతతో కలిసి సిటాడెల్ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ వెబ్ సిరీస్‌కి మంచి స్పందన వచ్చింది. అంతే కాకుండా వరుణ్ ధావన్‌కి నటుడిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇప్పుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్ ధావన్ సినిమాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమాను వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపిక చేశారు. త్వరలోనే ఈమె వరుణ్ ధావన్‌తో కలిసి షూటింగ్‌లో పాల్గొనబోతుంది. ఈ సినిమాకు 'హై జవానీ తో ఇస్క్ హెూనా హై' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వరుణ్ ధావన్, పూజా హెగ్డే కాంబోలో సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుంది అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా వీరిద్దరి మద్య కెమిస్ట్రీ కచ్చితంగా వర్కౌట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. పూజా హెగ్డేకి ఇది అతి పెద్ద ఛాన్స్‌గా చెప్పుకోవచ్చు. ఆఫర్లు లేకుండా దిక్కులు చూస్తున్న బుట్ట బొమ్మకి ఈ ఛాన్స్ రావడంతో మళ్లీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టాలీవుడ్‌లో ఒకానొన సమయంలో చాలా బిజీగా ఉండి స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒక్కసారిగా ఈ అమ్మడు మొత్తం మారిపోయింది. బిజీ బిజీగా సినిమాలు చేసే స్థాయి నుంచి ఆఫర్లు లేని స్థాయికి వచ్చింది. ముందు ముందు ఈ అమ్మడు బాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. తద్వారా టాలీవుడ్‌లో ఈమెకు మళ్లీ పిలిచి మరీ ఆఫర్లు ఇస్తారు. టాలీవుడ్‌లో ఈమె చివరగా చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. అందుకే ఆఫర్లు తగ్గాయి అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్.



# విక్రమ్ కొత్త చిత్రం 'వీర ధీర శూరన్' టీజర్ విడుదల




తమిళ కథానాయకుడు అయినప్పటికీ, తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా దగ్గరైన నటుడు విక్రమ్.... తమిళులకు 'చియాన్' విక్రమ్. విక్రమ్ కు తెలుగులోనూ ఫర్వాలేదనిపించే మార్కెట్ ఉంది. సరికొత్త పాత్రలు పోషించేందుకు ఆసక్తి చూపించే విక్రమ్ నటిస్తున్న కొత్త చిత్రం 'వీర ధీర శూరన్: పార్ట్ 2'. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్ రిలీజైంది. టీజర్ చూస్తే మాస్ యాక్షన్ ఎంటర్టయినర్ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకుడు. ఇందులో విక్రమ్ కు జోడీగా దుషారా విజయన్ నటిస్తోంది. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరమూడు తదితరులు కీలకపాత్రల్లో నటించారు. ఏఆర్ రెహమాన్ మేనల్లుడు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ 'వీర ధీర శూరన్: పార్ట్ 2' చిత్రం 2025 జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.


# ఆ పాత్ర చేయడం ఎంతో అదృష్టం

బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' నితీశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి భారీ బడ్జెట్‌తో అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ అపడేట్‌ను రణ్‌బీర్ పంచుకున్నారు. "రామాయణ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఎంతో గొప్ప కథ. చిన్నప్పటినుంచి వింటూ పెరిగాం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఇందులో వర్క్ చేస్తున్నారు. నితీశ్ తివారి అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా ఈ చిత్రం విడుదల కానుంది. పార్ట్1లో నా భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలోనే పార్ట్2 చిత్రీకరణ కూడా మొదలవుతుంది. ఇలాంటి పాత్రలో నటించడం నాకు కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైంది. మన భారతీయ సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సినిమా 'రామాయణ" అని అన్నారు. ఇటీవలే ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీలను తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి పార్ట్, 2027లో రెండో పార్ట్ విడుదల కానుంది. ఈ చిత్రం గురించి చాలా కాలంగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఫొటోలు షేర్ అవుతూనే ఉన్నాయి. సైలెంట్‌గా చిత్రీకరణను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తన పాత్ర కోసం రణ్‌బీర్ శిక్షణ తీసుకున్నారు. డైట్ ఫాలో అవుతున్నట్లు తెలిపారు. ఈ సినిమా పూర్తయ్యే వరకే మద్యం మామానేసినట్లు చెప్పారు. ఇక సీత పాత్రలో నటించడం తన అదృష్టమని సాయిపల్లవి చెప్పారు. ఇక ఇందులో రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు సమాచారం.



# అలాంటి ప్రేమ మరొకటి లేదు

## వైరల్‌గా సమంత పోస్ట్




స్టార్ నటి సమంత తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు 'సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య కొత్త బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. మరోనటి శోభిత ధూళిపాళ్లతో ఏడడుగులు వేశారు. వీరి వివాహం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహం వేళ సమంత పెడుతున్న పోస్ట్‌లు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. నాలుగు రోజుల క్రితం అమ్మాయి, అబ్బాయి కుస్తీ పోటీలకు సంబంధించిన వీడియో షేర్ చేసిన సమంత.. తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు 'సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారుతుండగా ఇంతలో తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించారు. మరోవైపు మాజీ భర్త మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్ర మనోవేదనలో ఉన్న సామ్‌కు నెటిజన్లు మద్దతుగా నిలుస్తున్నారు.

# తగ్గిన పుష్ప-2 టికెట్ ధరలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'పుష్ప2: ది రూల్'. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం అని తేడా లేకుండా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సునామీ సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కేవలం 3 రోజుల్లో ఈ చిత్రం రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా టికెట్ రేట్లకు సంబంధించి మూవీ ప్రేక్షకుల నుంచి నెగిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. బెనిఫిట్ షో టికెట్‌నే రూ.1250గా పెట్టిన చిత్రబృందం విడుదలైన తర్వాత టికెట్ రేట్లను సింగిల్ స్క్రీన్‌లో రూ.350గా.. మల్టీప్లెక్స్‌లో రూ.550గా పెట్టింది. దీంతో సాధారణ ప్రేక్షకులు ఈ సినిమాకు చాలా దూరమయ్యారు. ముఖ్యంగా ఒక ఫ్యామిలీ నుంచి నలుగురు ఈ సినిమాకి వెళ్లాలి అంటే సింగిల్ స్క్రీన్‌లో రూ.1380 అవ్వనుండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.2120లు కానుంది. దీంతో టికెట్ ధరలు మూవీపై చాలా ఎఫెక్ట్ పడ్డాయి. సోషల్ మీడియాలో అయితే టికెట్ ధరలపై సెటైర్లు , ట్రోలింగ్ ఓ రేంజ్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో పుష్ప నిర్మాతలు దిగొచ్చారు. సోమవారం నుంచి ఈ సినిమా టికెట్ ధరలు తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఇక తగ్గిన ధరల బట్టి చూసుకుంటే.. సింగిల్ స్క్రీన్‌లో రూ.200 ఉండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.350గా ఉంది. దీంతో అల్లు అర్జున్ అభిమానులు సంబరపడుతున్నారు. ఇప్పటి వరకు టికెట్ ధరలు చూసి భయపడ్డ ప్రేక్షకులు ఇకపై థియేటర్‌కు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.